# సద్యోగం

**– మనస్విని**

“ఏమిటీ! బస్సుల్లో టికెట్లిస్తావా? ఇంతకంటే ఏం ఉద్యోగం దొరకలేదా? చాల్చాల్లే!” విసురుగా అంది మాలతి.

“అది కాదమ్మా. ఈ కాలంలో ఉద్యోగాలు రావడమే కష్టంకదా? వచ్చింది ఎవరైనా వదులుకుంటారా?” నెమ్మదిగా అంది రాజేశ్వరి.

“ఆ... ఉద్యోగమంటే ఆడ మగ తేడా లేకుండా చేసే ఉద్యోగాలా? ఛీ...ఛీ... అంతమంది జనంలో తోసుకుంటూ వెళ్లి అందర్నీ టిక్కెట్ అడగడమా? హవ్వ” మాలతి ససేమిరా వీల్లేదంటూ మాట్లాడుతోంది. శ్వేతకేమో ఎలా సర్దిచెప్పాలో తెలియడంలేదు.

శ్వేత ఇంటర్వ్యూకు వెళ్లిన టైములో మాలతి ఊరు వెళ్లినందున అప్పుడు అభ్యంతరం చెప్పడానికి వీల్లేకపోయింది. ఊరు నుండి వచ్చిన తరువాత శ్వేతకేకాదు, భర్త సుధాకర్‌కు కూడా బాగా అక్షింతలు వేసింది. ఇప్పుడు ఇంటర్వ్యూలో సెలెక్టయినట్లుగా ఆర్టీసీ వాళ్ళు తెలిపేడప్పటికి మాలతి అగ్గిమీద గుగ్గిలం అవుతోంది.

“రాత్రి ప్రయాణాలు ఆడవాళ్ళకుండవమ్మా?” శ్వేత నసుగుతూ అంది.

“ఎంత రాత్రి ప్రయాణాలు లేకుంటే మాత్రం అన్ని ఉద్యోగాల్లోలాగా కుర్చీలో కూర్చుని చేసే ఉద్యోగం కాదు కదా!” అంది మాలతి గట్టిగా.

“అది కాదమ్మా. దూరంగా కూడా పంపరు. దగ్గర దగ్గర ఊర్లకే వేస్తారు.”

“నువ్వెన్నయినా చెప్పు. ఈ ఉద్యోగానికి వెళ్ళే పనేం లేదు” అంది ఖచ్చితంగా. ఆ మాట అంటూ మళ్ళీ “మీరేమిటి మీరేం మాట్లాడరు? ఇదిలా ఈ ఉద్యోగం అంటూ తిరుగుతూ వుంటే రేపు ఎవరు పెళ్లి చేసుకుంటారు దీన్ని? భార్య మగవాళ్ళను తోసుకుంటూ తిరుగుతుంటే భర్త సహిస్తాడా? ఎవరు వప్పుకుంటారండీ?” అని భర్తమీద విరుచుకుపడింది.

“సరే సరే మళ్లీ ఆలోచిద్దాంలే” అప్పటికి శ్వేతను మాలతి నుంచి రక్షించాడు సుధాకర్.

• • •

“ఏమిటా దీర్ఘాలోచన?” శేఖర్ పిలిచాడు.

శ్వేత పలకలేదు.

“ఏయ్ శ్వేతా! ఇద్దరికీ ఉద్యోగాలొచ్చాయి. అదీ ఒకే ఊర్లో. ఎంతో సంతోషించాల్సిన విషయంకదా! నువ్వేంటి అలా విచారంగా వున్నావు?”

రాములవారి గుళ్ళో మండపం ఎదురుగా మెట్లమీద కూర్చుని ఉన్నారు శ్వేత, శేఖర్‌లు.

జనం ఎక్కువగా రాని ఆ గుడే వాళ్ళ సంకేత స్థలం. దాదాపు రెండు సంవత్సరాల నుంచీ వాళ్ళు అక్కడ కలుసుకుంటున్నారు. మొదట్లో పూజారి వీళ్ళిద్దర్నీ అనుమానంగా చూసాడు. నెమ్మదిగా పూజారికి వివరించారు వీళ్ళు. కాలేజీల చదువులు పూర్తయి ఉద్యోగాల వేటలో వున్నామనీ, ఉద్యోగాలు దొరకంగానే పెళ్లి చేసుకోవాలనుకున్నారు. నెమ్మది నెమ్మదిగా పూజారిగారు కూడా వీళ్ళ ఉద్యోగాల వేట గురించి వింటూ ఉండేవారు. అందువల్ల ఎప్పుడూ ఈ గుడికే వచ్చి కలుసుకుంటారు శ్వేత, శేఖర్‌లు.

ఎదురుగా వున్న కోనేట్లో చిన్న చిన్న రాళ్ళు వేస్తున్న శ్వేత కొద్దిసేపటికి రాళ్లు వేయడం ఆపి నెమ్మదిగా తన కంటే పైమెట్టుమీద కూర్చుని వున్న శేఖర్ మోకాలిమీద రెండు చేతులు వేసి ఆ చేతుల మీద తలొంచుకుంది.

శేఖర్ ఒక్క నిముషం శ్వేత తల నిమురుతూ ఉండిపోయాడు ఏమీ మాట్లాడకుండా.

“శ్వేతా! ఏమయింది?” శ్వేత గడ్డం పట్టుకుంటూ అన్నాడు శేఖర్.

శ్వేతకు మాట్లాడితే ఏడుపు పొంగి వచ్చేట్టుగా వుంది.

శేఖర్ నెమ్మదిగా శ్వేత మొహాన్ని తనవైపు తిప్పుకున్నాడు.

“కన్నీళ్ళా?” శేఖర్ కంగారుగా అన్నాడు.

శేఖర్ వెంటనే పైమెట్టు మీదనుంచి క్రిందకు దిగాడు. శ్వేత పక్కనే కూర్చున్నాడు.

శ్వేత వెంటనే అతని ఒళ్లో వాలిపోయింది. తను కన్న కలలన్నీ కల్లలైపోతుంటే తట్టుకోలేకపోతోంది శ్వేత.

“మా అమ్మ నా ఉద్యోగాన్ని అంగీకరించడంలేదు. ఇంక మన పెళ్లికెలా ఒప్పుకుంటుంది?” వెక్కిళ్ళ మధ్యలో అంది శ్వేత.

శ్వేతను పట్టుకున్న శేఖర్ చేతులు ఒక్క నిముషం బిగుసుకున్నాయి. నెమ్మదిగా ఉద్వేగాన్ని కంట్రోల్ చేసుకున్నాడు.

“శ్వేతా!” నెమ్మదిగా పిలిచాడు.

శ్వేతకు ఉదయ్యం నుంచీ బిగబట్టుకున్న ... పొంగుతున్నది. ఇన్నిరోజులూ వారి వివాహానికి అ... తరం శేఖర్ నిరుద్యోగ మొస్తుందనుకుంటే ఇ... ఉద్యోగమొచ్చినా అమ్మావాళ్ళు ఒప్పుకునేట్లుగా లే...

“కండక్టరు ఉద్యోగం ఇష్టం లేదంటోంది అమ్మ. ఆ... వాళ్ళు మాత్రమే కాదు, మగవాళ్లక్కూడా ఆ ఉద్యోగ... ద్దుట” అంది శ్వేత కన్నీళ్ళు ఆపుకుంటూ.

“ఎందుకట?” శేఖర్, శ్వేతను సరిగా కూర్చోబెడుతూ అన్నాడు.

“చెప్తాను విను. అమ్మ ఒకసారి గ్రామణి బస్సులో మా బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు ప్రక్క ఊరికి వెళ్లిందట. అప్పుడేం జరిగిందటే...”

కళ్లకు కట్టినట్టుగా చెప్పడం మొదలుపెట్టింది శ్వేత.

• • •

మాలతిని బాలాజీ నగర్ నుంచి విఆర్‌సి సెంటర్ వరకు స్కూటర్‌మీద వదిలాడు సుధాకర్. కొద్దిసేపటికి తను ఎక్కవలసిన గ్రామణి బస్సు వస్తూనే లేడీస్ ముందు కనుక ముందు లైన్ నుంచి ఎక్కింది. బస్‌లో పెద్దగా రష్‌లేదు. డ్రైవర్ వెనుకవైపు రెండవ సీట్లో



కూర్చుంది మాలతి. ఎడమ చేతివైపు మొదటి సీట్లో ఒక మగతను కూర్చుని వున్నాడు.

లేడీ కండక్టర్ టిక్కెట్లు ఇస్తూ వెనుకనుంచి వచ్చి మాలతి దగ్గర ఆగింది. మాలతి తగినంత డబ్బు ఇచ్చి టిక్కెట్టు తీసుకుని పర్స్‌లో పెట్టుకుంది. చివరగా మాలతికి టిక్కెట్టిచ్చిన లేడీ కండక్టర్ నేరుగా వెళ్లి ఎడమవైపు మొదటి సీట్లో కూర్చున్న మగమనిషి ప్రక్కన కిటికీ పక్కగా కూర్చుంది. అది చూసిన మాలతి విస్తుపోయింది.

ఈమధ్య లేడీ కండక్టర్స్ వచ్చిన తరువాత ఆడవారికి దొరికిన మహత్తరమైన అవకాశమేమిటంటే కండక్టర్ పక్క సీట్లో కూర్చోగలగడం. ఇంతకుముందు మగ కండక్టర్స్ ప్రక్కన మగవాళ్ళు కూర్చునేవాళ్ళు. ఇప్పుడు వాళ్ళకు అవకాశం తగ్గిపోయింది.

కానీ...ఇప్పుడీ అమ్మాయేంటి? అలా...పోనీ బంధువేమో అనుకుందామంటే అతనిప్పుడు ఆ లేడీ కండక్టర్ వ్రాసిన టిక్కెట్ల వివరాల పేపర్స్‌ను తీసుకుని చూస్తున్నాడు. ఆ అమ్మాయికి పెళ్ళయినదీ, లేనిదీ తెలియదుగానీ ఓ పాతిక సంవత్సరాల వయసుంటుంది. అతన్ని ఆనుకుని కూర్చుని అతని తొడమీద ఒక చెయ్యివేసి మరీ మాట్లాడుతోందామె. చూస్తున్న మాలతికి కంపరంగా అనిపించింది. అంటే అతను ఆ అమ్మాయికి కండక్టర్‌గా ట్రైనింగ్ ఇస్తున్నాడన్నమాట. సరే బాగానే వుందిగానీ ట్రైనింగ్ ఇప్పిస్తే అలా మీద మీద పడాలా? ఆలోచిస్తున్న మాలతి తనేమైనా ఎక్కువగా ఆలోచిస్తోందేమో? తనకెందుకువారి మీద ధ్యాస? అనుకునేంతలో కండక్టర్ వెనుక సీట్లో కూర్చున్న ముసలమ్మ ఆ పిల్లనడిగింది.

''సూడమ్మా! ఆయన నీ పెనిమిటా?'' అని.

ఆ ముసలమ్మ మాటలకు గలగలా నవ్విందా పిల్ల.

''కాదు తల్లి. ఆయన మాకంటే పెద్ద కండక్టరు'' అంది దీర్ఘం తీస్తూ.

''మరయితే అట్ల మీద మీద పడ్తవేందమ్మా?'' అందామె.

నాగరికత ముసుగు పూర్తిగా అలవడని ఆ ముసలామె డైరెక్టుగా ఆ పిల్లనే అడిగింది. ఆ మాటకు అతను వంచిన తల ఎత్తలేదు.

కానీ ఆ పిల్ల మాత్రం ''ఆ...అట్లనుకుంటే మేం ఉద్యోగాలు చేసినట్లే'' అంది అతని భుజంమీద చెయ్యివేసి గట్టిగా నవ్వుతూ.

ఇదంతా వింటున్న మాలతికి ఆడవాళ్ళు చదువుకుని ఉద్యోగాలు చేస్తుండడం ఆడవారి అభివృద్ధికి కాకుండా ఇలా అధ్వాన్న స్థితిలోనికి తోసెయ్యబడటానికా? మాలతికి తల తిరిగినట్లయింది.

ఆడవాళ్ళు ఉద్యోగలా చేయాలంటే మగవాళ్ళకిలా లొంగిపోవాలా? అయితే ఆ పిల్ల ఇలాంటి అభిప్రాయాన్ని ఎలా డెవలప్ చేసుకుంది? ఆలోచిస్తూ తను దిగే ఊరు రాగానే లేచి బస్సు దిగేసింది. ఆ పిల్ల మొహం చూడాలంటే అసహ్యం వేసింది. అక్కడ ఫంక్షన్‌లో కూడా మూడీగానే వుండిపోయింది.

మధ్యాహ్నం భోంచేసి మళ్లీ తిరుగు బస్ ఎక్కేటప్పటికి ఆ బస్‌లో ఇంకో కండక్టర్ పిల్ల వుంది. ఫుల్ రష్‌గా వున్న బస్‌లో చాలామంది నిలబడే ఉన్నారు. ఈ కండక్టర్ అమ్మాయి మగవాళ్ళ మధ్యలో దూరి డబ్బులు తీసుకుని టిక్కెట్లు ఇస్తోంది. ఆ సీన్ చూస్తుంటే అయ్యో అనిపిస్తుంది. కానీ ఉద్యోగధర్మంకదా, ఆ పిల్లకి ఇష్టం వున్నా లేకున్నా తప్పదు మరి. అయినా ఆ కండక్టర్లకు రష్ ఎక్కువగా ఉండని ఎక్స్‌ప్రెస్ బస్‌లకు వేస్తే బాగుంటుందేమో అనిపించింది మాలతికి క్షణంపాటు. కానీ నైట్ డ్యూటీ ఇబ్బంది లేకుండా ఆడ కండక్టర్లను ఎక్కువ దూరం కూడా పంపకుండా ఉండడంకోసమే ఇలా దగ్గర దగ్గర పల్లెలకూ, పగలు ప్రయాణానికి వేస్తారని వింది. అందువల్ల ఎక్స్‌ప్రెస్‌లకు వీలవదు. ఇలా ఆలోచిస్తున్న మాలతి ఇంటికి వస్తూనే సుధాకర్‌తో ఆడకండక్టర్ల బాధలు చెప్పి వాపోయింది కూడా.

• • •

''అందువల్ల అమ్మకు ఈ ఉద్యోగం నేను చేయడం ఇష్టంలేదు. అమ్మ నాన్నతో చెప్పేదంతా మేం కూడా విన్నాను. ఇంటర్వ్యూ వచ్చినప్పుడు అమ్మ ఊర్లో లేదు. మనం ఏదో ఉద్యోగాలకు అప్లై చేస్తున్నామనుకుందిగానీ కండక్టర్లకంటే అప్పుడే వద్దనేది. ఇప్పుడు అమ్మనెలా కన్విన్స్ చేయాలో తెలియక సతమతమవుతున్నాం నేనూ నాన్నగారు.''

మాలతి అనుభవాన్ని చెప్పిన తరువాత అంది శ్వేత.

''ఒక పని చేద్దాం. రేపు మా నాన్నగారికి మన విషయం చెప్పి మా నాన్న పర్మిషన్ తీసుకుని నేనూ, మా నాన్నగారూ మీ ఇంటికొస్తాము'' శ్వేత మాటలు విని బాగా ఆలోచించిన తరువాత అన్నాడు శేఖర్.

సంభ్రమంగా తల ఎత్తింది శ్వేత.

''నిజంగా?'' అంది ఆనందంతో.

''నిజంగా నిజం!'' అన్నాడు వత్తి పలుకుతూ.

''థాంక్యూ థాంక్యూ'' సంతోషంగా అంది శ్వేత, శేఖర్ భుజంమీద తల ఆనిస్తూ.

''సమస్య వస్తే కన్నీళ్ళు కారుస్తూ కూర్చోవడం కాదు. మనకు తోచినంతలో పరిష్కారం ఆలోచించుకోవాలిగానీ ఇలా బెంబేలుపడిపోతారా?'' శ్వేత తల నిమురుతూ అన్నాడు శేఖర్.

• • •



''మాలతీ! రామలింగంగారి అబ్బాయి గురించి నీ అభిప్రాయం ఏమిటి?'' సుధాకర్ మాటలకు ప్రశ్నార్థకంగా చూసింది మాలతి.

''ఏంలేదు. మన శ్వేతను వాళ్ళబ్బాయి శేఖర్‌కిచ్చి చేస్తే బాగుంటుందని అడిగాను'' అన్నాడు. మళ్ళీ ''కండక్టర్ ఉద్యోగం వచ్చింది. తొందరలో జాయిన్ అవబోతున్నాడు కూడాను. శ్వేతక్కూడా అభ్యంతరం ఉండదనుకుంటాను. అందుకే...'' ఇంకా అతని మాటలు పూర్తి కాకుండానే.

''ఓహో, కండక్టర్ ఉద్యోగమా?'' అంది నిరసనగా.

''అలాగనకు మాలతీ. అది మాత్రం ఉద్యోగం కాదా'' అన్నాడతను. ''మీకు తెలుసు నాకా ఉద్యోగం మీద మంచి అభిప్రాయం లేదని'' అంది మాలతి ఆరేసిన బట్టలు మడతపెడుతూ.

''అది కాదు మాలతీ! ఉదయం రామలింగంగారు ఫోన్ చేసారు. వాళ్ళబ్బాయి, మనమ్మాయి ఒకరినొకరు ఇష్టపడుతున్నారనీ, పిల్లల స్నేహాన్ని విడదీయకుండా వాళ్ళను ఆశీర్వదిద్దామనీ, మగపిల్లవాడి తండ్రిననే అహంకారం లేకుండా మాట్లాడాడు. అలాంటప్పుడు మన అభ్యంతరం ఏంటి?''

అతని మాటలు పూర్తి కాకుండానే ''అమ్మాయి సుఖం కూడా చూడాలి కదండీ!'' అంది మడతలు వేసిన బట్టలు బీరువాలో పెడుతూ.

''కాదనను. నువ్వు ఏ కలక్టరునో తెచ్చి పెళ్ళి చేసినా దానికి సంతోషముండకపోవచ్చు. తనిష్టపడిన కండక్టరే తన దృష్టిలో కలెక్టర్. అది మనకు చెప్పడానికి భయపడుతూ వుండవచ్చు. సాయంత్రం ఆ తండ్రీకొడుకులిద్దరూ మనకు అభ్యంతరం లేకపోతే మనింటికి వస్తామన్నారు. నేను రమ్మన్నాను. కానీ పిల్లల మనసు తెలుసుకుని ప్రవర్తించాలికదా! అందుకే ఒకసారి అమ్మాయి అభిప్రాయం కూడా తెలుసుకో'' అన్నాడు సుధాకర్ బయటికెళ్తూ. మాలతి మౌనంగా ఉండిపోయింది. శ్వేత, శేఖర్‌లు ఇష్టపడుతున్నారని రామలింగంగారే చెప్పినప్పుడు తనింక శ్వేతను ప్రత్యేకంగా అడిగేదేం వుంది అనుకుంది.

• • •

''మా అబ్బాయి మీ అమ్మాయిని ఇష్టపడుతున్నాడని తెలిసిన తరువాత మీరే వచ్చి నన్ను పిలవాలని నేననుకోలేదు. పిల్లల ఇష్టం నెరవేరిస్తేనే వాళ్ల మొహంలో సంతోషం కనిపిస్తుందని అనిపించింది. ఆ తరువాత మీ ఇష్టం'' అన్నారు రామలింగంగారు మాలతి ఇచ్చిన కాఫీ తాగుతూ.

''కష్టమెక్కువనే కాదన్నయ్యగారూ. నైట్ డ్యూటీలు, ఎండైనా, వానైనా వెళ్లాలి. రోజూ ప్రయాణాలతో అలసిపోతారు. ఇంక సంసారంలో సుఖమేముంటుంది చెప్పండి. అదీగాక నేను చూసిన ఒకటి రెండు సంఘటనలు నన్ను ఆ ఉద్యోగమంటే అసహ్యపడేట్లు చేశాయి'' అంది మాలతి తన మనసులోని మాట వారికి చెప్తూ.

శ్వేత మాటలద్వారా విషయం అర్థమైన రవి, సుధాకర్ వైపు చూసాడు 'మీరే సర్దిచెప్పండి' అన్నట్లు.

అది అర్థమైన సుధాకర్ మాలతికి ఎందుకు కండక్టర్ల ఉద్యోగాలంటే ఇష్టంలేదో రామలింగంగారికి వివరించారు.

సుధాకర్ చెప్పిందంతా విన్న రామలింగంగారు ''మీ అభిప్రాయం తప్పమ్మా! ఏ ఉద్యోగంలో అయినా మనిషి ప్రవర్తన, అతను నీతి నియమాలకు కట్టుబడడంపైన ఆధారపడి వుంటుంది. కానీ అందరూ ఒకేలాగ ఉండరు. మీకు తెలిసిందేకదా? నర్సు ఉద్యోగం చేసేవాళ్ళమీద ఎంతమందికి సదభిప్రాయం ఉంది? మరి నర్సులంతా మంచివాళ్ళు కాదా? అలాగే అన్ని ఉద్యోగాల్లోనూ. అంతేగానీ ఫలానా ఉద్యోగం చేస్తేనే చెడిపోతారు అనేం లేదమ్మా!'' అన్నారు నిదానంగా.

అంతలో రవి కూడా నెమ్మదిగా ''ఆంటీ! మా అన్నావదిన ఇద్దరూ ఉద్యోగస్థులే. వదినకు అన్నయ్య ఎంతో హెల్ప్‌గా వుంటాడుకాబట్టి మీరా దిగులేం పెట్టుకోవద్దు. మాకు ఉద్యోగం కంటే మా జీవితం ముఖ్యం. ముందు మమ్మల్నిద్దర్నీ మామూలు మనుషులుగా చూడండి. ఆ తరువాత మేము చదివిన గ్రాడ్యుయేషన్‌కు ఇంతకంటే మంచి ఉద్యోగమొస్తుందని మేము అనుకోవడంలేదు. ఇంకా ఎన్ని రోజులు మేం నిరుద్యోగులుగా ఉండాలి? అయినా మాకు ఇంత త్వరగా ఏ రిజర్వేషను లేకుండా ఉద్యోగం రావడం నిజంగా మా అదృష్టమనే చెప్పాలి. మీరీ విషయంలో సందేహించకండి. దాదాపు మూడు సంవత్సరాల మా స్నేహాన్ని మీరు మన్నించి మా మనసులు ఎంత వ్యథ చెందుతామో మీరు ఆలోచించండి'' అన్నాడు.

ఇంతకంటే రవి ఇంకేమీ మాట్లాడలేకపోయాడు. నెమ్మదిగా తల వంచుకున్నాడు. మనసులో బాధ సుళ్ళు తిరుగుతోంది.

అది గమనించిన సుధాకర్, శేఖర్ భుజంమీద చెయ్యి వేశాడు ధైర్యం చెబుతున్నట్లు.

మాలతి మరింకేమీ మాట్లాడలేకపోయింది. మధ్యాహ్నం నుంచి ఆలోచిస్తూనే వుంది. ఈ రెండు మూడు సంవత్సరాల నుంచీ పిల్లలిద్దరూ అప్పుడప్పుడు వాళ్లింట్లో, వీళ్లింట్లో కలసినప్పుడు మామూలుగా మాట్లాడుతున్నారనుకున్నదేగానీ వాళ్ళు జీవితాలను ముడి పెట్టుకుందామనుకున్నారని తెలుసుకోలేకపోయింది.

అందుకే రామలింగంగారు అన్ని విషయాలు వివరంగా మాట్లాడిన తరువాత ఇంకేం అభ్యంతరం చెప్పకుండా వెంటనే పాయసం చేసి అందరిచేత తీపి తినిపించింది. శ్వేత అందరికీ కప్పులు ట్రేలో పెట్టుకుని తెచ్చి ఇచ్చింది.

''కళ్ళలో పెళ్లి పందిరి కనబడసాగే'' అంటూ శ్వేత తమ్ముడు శచీంద్ర పాడటంతో రవి దగ్గరకువచ్చిన శ్వేత నెమ్మదిగా తలెత్తి రవివైపు చూసింది. ట్రేలో నుంచి పాయసం కప్పు తీసుకుంటూ రవి శ్వేతవైపు చూసాడు. సంతోషంతో నిండిన కళ్లకు ఇద్దరూ ఒకరికొకరు మసగ్గా కనిపించారు.

★

## చిలుక పలుకుల రవీనా



★ అందరితో 'నా వయసు పాతికేనని అయిదేళ్ళ నుంచీ చెబుతూనే వుంది రవీనా' అంటున్నారు బాలీవుడ్ జనాలు. అది వదిలేసి రవీనా చిలుక పలుకులు ఏంటో తెలుసుకుంటే..

★ నాంది (హిందీలో శూల్)లో నేను సాధారణ గృహిణిగా, ఒక బిడ్డకు తల్లిగా నటించినా, నా గ్లామర్ చెక్కు చెదరలేదు.

★ నేను పని దొంగనని ప్రచారం చేసేవాళ్ళని చూస్తే జాలి కలుగుతుంది. అయితే అందులో కొద్దిగా నిజమున్నా, ఆ తర్వాతర్వాత సరిదిద్దుకున్నాను. (డబుల్ స్టేట్‌మెంట్ అంటే ఇదేనేమో...)

★ అక్షయ్‌తో నా ఎఫైర్ కంటిన్యూ అయినప్పుడు ప్రతి చెత్త సినిమా ఒప్పుకున్నాను. (అంటే అక్షయ్ కోసం త్యాగం చేసి, చెత్త సినిమాలు చేసిందనా?!)

★ అక్షయ్, సన్నీడయాల్, గోవిందా.. వీళ్ళందరితోను నాకు లింకులున్నాయంటున్నారు. నాకన్నా, నా వెన్నగ్గా షాడో చేసేవాళ్ళకే ఆ విషయం తెలియాలి.

★ ఇంకా నయం.. నాగ్‌ను (నాగార్జునను) కాకాపట్టి ఈ అవకాశం (ఆకాశవీధిలో) సంపాదించుకున్నానని అన్లేదు.

- విరాజి

